క్లుప్తంగా

అడవి పేరంటాళమ్మ తిరునాళ్ల ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో అడవి పేరంటాళమ్మ

పీసీపల్లి: మండల పరిధిలోని మురుగమ్మి, నేరేడుపల్లి అడవి పేరంటాళమ్మ తిరునాళ్ల సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అంకురార్పణ, గ్రామోత్సవం, మూలవిరాటోత్సవం నిర్వహించి ప్రత్యేకంగా కుంకుమ పూజలు నిర్వహించారు. 21న గ్రామోత్సవం, 22న పొంగళ్ల నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తిరునాళ్ల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

నాలుగు పోలింగ్ కేంద్రాల కేటాయింపు

పామూరు: ఉపాధ్యాయ, పట్టభద్రుల కోటాలో వచ్చే మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు పామూరులో 4 పోలింగ్ కేంద్రాలు కేటాయించినట్లు తహసీల్దార్ బీఆర్ఎల్వీ ప్రసాద్ తెలిపారు. మండలంలో మొత్తం పట్టభద్రుల ఓట్లు 2406 కాగా ఉపాధ్యాయుల ఓట్లు 132గా ఉన్నాయన్నారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

రైతులకు దాణా పంపిణీ



రైతులకు దాణా అందచేస్తున్న డాక్టర్, సర్పంచ్

కనిగిరి రూరల్: ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అందించే పథకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి బత్తుల బాలకృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రైతులకు సమీకృత దాణాని కేజీ రూ. 6.50 లకు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు 33 టన్నుల సమీకృత దాణాను కేటాయించినట్లు చెప్పారు. సర్పంచ్ చిలంకూరు నాగార్జునరెడ్డి, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓగా ప్రసాద్‌రావు బాధ్యతల స్వీకరణ



ప్రసాద్‌రావు ఎంఈఓ

పీసీపల్లి: మండల విద్యాశాఖాధికారిగా డి.ప్రసాద్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జే.ప్రసాద్‌రావు కనిగిరికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎంఈఓ ప్రసాద్‌రావు మాట్లాడుతూ మండలంలోని టీచర్ల సమస్యలు పరిష్కరిస్తానని, విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

31 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

సింగరాయకొండ: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు సోమవారం సోమరాజుపల్లి పంచాయతీ టీపీ నగర్ ప్రాథమిక పాఠశాలలో 31 మంది వృద్ధులకు నేత్ర పరీక్షలు చేశారు. పలువురిని కళ్ల జోళ్ల కోసం సిఫార్సు చేశారు. అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా ఆపరేషన్ చేయిస్తుందని ఆప్తమాలజిస్ట్ చంద్రశేఖర్ చెప్పారు. ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌ఆలీ, రాఘవేంద్రరావు, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్ఎం త్రివేణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రసాద్ సేవలు ప్రశంసనీయం

పీసీపల్లి: ఎంఈఓగా ప్రసాద్ సేవలు ప్రశంసనీయమని ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. కనిగిరికి బదిలీ అయిన ఎంఈఓ జగన్నాథం ప్రసాద్‌రావుకు సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ రమణారెడ్డి మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి ప్రసాద్‌రావు చేసిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం ప్రసాద్‌రావును ఎంపీడీఓ, మండలంలోని హెచ్ఎంలు, టీచర్లు సత్కరించారు.



ప్రసాద్‌రావును సత్కరిస్తున్న ఎంపీడీఓ, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు

తెగుళ్లతో రైతన్న దిగాలు



వేరుకుళ్లు తెగులు సోకిన శెనగ పంట



నల్లి తెగులు సోకిన మిరప పంట

- మిరపలో నల్లి, శనగ వేరుకుళ్లు తెగుళ్ల ఉధృతి
- పంటలను పూర్తిగా తినేస్తున్న తెగుళ్లు
- వేలకు వేలు పెట్టుబడుల రూపంలో కోల్పోతున్న రైతులు
- ప్రస్తుతం 8వేల ఎకరాల్లో శనగ, 3,375 ఎకరాల్లో మిర్చి సాగు



తెగులు సోకిన మిరప మొక్క ఇలా

కందుకూరు: క్రిమిసంహారక మందులకు సైతం లొంగని తెగుళ్లు రైతులను పీల్చిపిప్పి చేస్తున్నాయి. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలను అమాంతం మింగేస్తున్నాయి. మిరప పంటను ప్రధానం నల్లి(ఎర్రనల్లి, నల్ల నల్లి) తెగులు ఆశిస్తుండగా, శనగ పంటను వేరుకుళ్లు తెగులు తుడిచిపెట్టేస్తుంది. నియోజకవర్గంలో రబీ సీజన్‌లో ప్రధాన పంటలైన ఈ రెండు పంటలనే తెగుళ్లు తినేస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

శనగలో వేరుకుళ్లు

నియోజకవర్గంలో రబీ సీజన్‌లో పొగాకు తరువాత అత్యధికంగా సాగయ్యే పంట శనగ. నియోజకవర్గంలోని కందుకూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం, గుడ్లూరు వంటి మండలాల్లో ఈ పంటను ప్రధానంగా సాగు చేస్తారు. సాధారణ విస్తీర్ణం 11,800 ఎకరాలు కాగా, ఈ ఏడాది కాస్త తగ్గి 8 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఎక్కువగా కాగ్–2(తెల్లశెనగలు) రకానికి చెందిన శనగపంటను సాగు చేశారు. దీనికి ప్రధాన కారణం వేరుకుళ్లు తెగులు సోకుతుందని భయంతో ఈ ఏడాది చాలా మంది పంటను సాగు చేయలేదు. శనగ పంటకు బదులుగా పొగాకు సాగువైపు మొగ్గుచూపారు. రైతులు భయపడినట్టే ఈ ఏడాది కూడా శనగ పంటలో వేరుకుళ్లు తెగులు అధికంగానే ఉంది. ఈ తెగులు సోకిన పంట పూర్తిగా ఎండిపోతుంది. మొక్క వేరు వ్యవస్థను పూర్తిగా తినేయడంతో మొక్క దశలో పంట మొత్తం ఎండిపోతుంది. తెగులును నివారించే క్రిమిసంహారక మందులను శాస్త్రవేత్తలు ఇప్పటి వరకు కనిపెట్టలేదు. దీంతో ఈ తెగులు సోకిన పంటపై రైతులు పూర్తిగా ఆశలు వదులుకోవాల్సిందే. పంటమార్పిడి విధానం తప్ప తెగులు నివారణకు మరో ప్రత్యామ్నాయం లేదని చెప్తున్నారు. దీంతో ఎకరాకు దాదాపు రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట ఎందుకూ పనికిరాకుండా పోతుంది. పెట్టుబడిలో పైసా వెనక్కి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిరపను నమిలేస్తున్న నల్లి

మిరప సాగు రైతులు కూడా నల్లి తెగులు బెడదను ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గంలో 3,375 ఎకరాల్లో ప్రస్తుతం మిరప సాగులో ఉన్నట్లు ఉద్యానవనశాఖ అధికారులు చెప్తున్నారు. మిరప మార్కెట్ ఆశాజనకంగా ఉండి క్వింటాల్ మిరప ధర అధికంగా ఉండడంతో రైతులు ఈ పంట వైపు మొగ్గుచూపుతున్నారు. మిగిలిన పంటలతో పోల్చితే వ్యయప్రయాలతో పాటు, సాగుకు అయ్యే పెట్టుబడి కూడా అధికమే. ఎకరా సాగుకు దాదాపు రూ.లక్ష పెట్టుబడి కింద పెట్టాల్సిన పరిస్థితి ఉంది. ఇంత చెమటోడ్చి సాగు చేసిన పంటను రైతు కళ్ల ముందే నల్లి అనే తెగులు తినేస్తుంది. ఈ తెగులు సోకిన పంటలో మిరప మొక్కలు ఆకులు పూర్తిగా ముడుచుకుపోయి ఎండిపోతాయి. కాయలు వచ్చే పరిస్థితి ఉండదు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఈ తెగులు విజృంభిస్తుంది. దీంతో పంటను కాపాడుకోవాలనే ఆతృతతో రైతులు మూడు రోజులకు ఒకసారి వేలకు వేలు ఖర్చు చేసి పురుగు మందులు కొడుతున్నారు. అయినా కూడా తెగులు లొంగడం లేదు. ఫిబ్రవరి చివరిలో కొంత అదుపులోకి వచ్చే అవకాశం ఉందని చెప్తున్నారు. దీనిపై వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటి వరకు అయితే ఈ తెగులును నివారించే పురుగు మందులు అయితే అందుబాటులో లేవు.

> **పంటమార్పిడి విధానం పాటించాలి**
> శెనగ పంటలో వస్తున్న వేరుకుళ్లు తెగులు నివారణకు మందులు అందుబాటులో లేవు. పంట మార్పిడి విధానం పాటించడం ఒక్కటే మార్గం. ప్రస్తుతం ఎండలు పెరగడం వల్ల కూడా తెగులు అధికంగా సోకుతుంది. శనగ బదులు జొన్న వంటి పంటను పంట మార్పిడి విధానం కింద సాగు చేయాలని సూచిస్తున్నాం.
> – శేషగిరి, ఏడీఏ

> **పురుగుమందులు అందుబాటులో లేవు**
> మిరపలో ప్రస్తుతం నల్లి తెగులు అధికంగా ఉన్న మాట వాస్తవమే. దీనిపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నాం. తెగులు నివారణకు ఎటువంటి మందులు అందుబాటులో లేకపోవడంతో నివారణ కష్టంగా ఉంది. దీనిపై శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. ఉపశమనంగా జీగురు అట్టలు, సోంగామియాసోప్ వంటి నివారణ పద్ధతులు పాటించాలి. తెగులుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.
> – బ్రహ్మసాయి, ఉద్యానవనశాఖ అధికారి

ప్రాథమికోన్నత పాఠశాల తనిఖీ



విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలిస్తున్న ఏఎంఓ

గుడ్లూరు: మండలంలోని తెట్టు ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా ఏఎంఓ సుధీర్ సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, రిజిష్టర్లు, ఉపాధ్యాయుల డైరీ, లెస్సన్ ప్లానులును ఏఎంఓ పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థుల వర్క్ బుక్స్, నోట్ బుక్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా అదనపు తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరిసరాలు, టాయిలెట్లును ప్రతి రోజు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అనంతరం అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలించి నాణ్యతలో రాజీ లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు అమరేశ్వర్ ఉన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

గుడ్లూరు: గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు కలిసిమెలిసి సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్ సీపీ సచివాలయ జేసీఎస్ కన్వీనర్ గాజుల కిషోర్, ఎంపీపీ పులి రమేష్, జెడ్పీటీసీ కోర్నిపాటి బాపిరెడ్డి అన్నారు. మండలంలోని పరకొండపాడు, దప్పళంపాడు గ్రామాల్లో సోమవారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేటాయించిన ప్రతి గృహానికి వెళ్లి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలను వివరించి, వారి సమస్యలను తెలుసుకొని తెలియచేస్తూ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అందచేయాలన్నారు. మండల అధికార ప్రతినిధి బిల్లా రమణయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సర్వే వేగంగా పూర్తి చేయాలి



సంక్షేమ పథకాల వివరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సీఎస్‌పురం: ఆయుష్మాన్ భారత్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని ఉప్పలపాడు సచివాలయాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. సంక్షేమ పథకాల లబ్ధి కోసం నూతనంగా ఏవైనా దరఖాస్తులు వచ్చాయా, సంక్షేమ పథకాల లబ్ధికి అర్హత ఉండి లబ్ధి పొందని వారు ఎవరైనా ఉన్నారా వంటి వివరాలను సమీక్షించారు. ఆయుష్మాన్ భారత్ సర్వేలో వెనుకబడి ఉన్నామని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యతగా పనిచేసి సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

వైభవంగా నీలకంఠేశ్వరుని కల్యాణం



ఉలవపాడులో నీలకంఠేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ఉలవపాడు: మండల కేంద్రంలోని గంగాపార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి కల్యాణం సోమవారం కన్నులపండువగా జరిగింది. శివరాత్రి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు అందుకున్న అనంతరం స్వామికి కల్యాణం జరిపించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక అలంకరణలతో కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భరతనాట్యం భక్తులను అలరించాయి.

120 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికి ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా సోమవారం వేములపాడు, కోటతిప్పల గ్రామాల్లో 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. వివిధ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రతాపరెడ్డి, వైద్య సిబ్బంది, 104 వాహన వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



అక్రమ మద్యం పట్టుకున్న సెబ్ అధికారులు

కందుకూరు: పాండిచ్చేరి నుంచి అక్రమంగా మద్యం తెచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని సెబ్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. సెబ్ సీఐ డి.వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం..దుకూరులోని గుర్రంవారిపాలెంకు చెందిన పల్లపు మాల్యాద్రి కందుకూరు పరిసర ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం తెలియడంతో సెబ్ ఎస్సై డి.మౌలాలి ఆధ్వర్యంలో సిబ్బందితో నిఘా ఉంచి కేసరిగుంట ప్రాంతంలో మాల్యాద్రిని అదుపులోకి తీసుకుని విచారించగా పాండిచ్చేరి నుంచి మద్యం తెచ్చి అమ్ముతున్నట్లు చెప్పారు. మాల్యాద్రి నుంచి 55 ఫుల్‌బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.55 వేలు ఉంటుందన్నారు. అక్రమ మద్యం విక్రయిస్తున్న మాల్యాద్రిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కూలిన వాటర్‌ప్లాంట్ షెడ్

- రూ.3.50 లక్షల పరికరాలు ధ్వంసం

పామూరు: సిమెంట్ ఇటుకలతో కట్టిన వాటర్‌ప్లాంట్ షెడ్ ఒక్కసారిగా కూలింది. ఈ ఘటన సోమవారం పామూరు సీఎస్‌పురంరోడ్‌లో చోటుచేసుకుంది. పామూరుకు చెందిన పెద్దిరెడ్డి కొన్ని రోజులుగా సీఎస్‌పురం రోడ్డులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎదురుగా వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తున్నాడు. ఈసందర్భంలో సిమెంట్ ఇటుకలతో ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంట్‌షెడ్ సాయంత్ర సమయంలో ఒక్కసారిగా కూలిపోయి ప్లాంట్ పరికరాలు ధ్వంసమై రూ.3.50 లక్షల పైచిలుకు నష్టం వాటిల్లింది. అదృష్టవశాత్తు సమయానికి ఎవ్వరూ వాటర్‌ప్లాంట్‌లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

డీఎల్‌డీఓ పరిశీలన



చాగల్లు సచివాలయాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ పద్మజ

ఉలవపాడు: మండల పరిధిలోని వీరేపల్లి, చాగల్లు గ్రామ సచివాలయాలను డీఎల్‌డీఓ పద్మజ సోమవారం పరిశీలించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. స్పందన కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతగా పనిచేయాలన్నారు. సచివాలయ రికార్డులను పరిశీలించారు. ర్యక్రమంలో ఎంపీడీఓ చెంచమ్మ, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మార్కాపురం టౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఆమలక లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణారెడ్డి తెలిపారు. 23న ఉత్సవ ప్రారంభ స్నపనం(అంకురార్పణ), లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, 24న సామూహిక లక్ష్మీపూజ(కుంకుమార్చన), 25న అగ్నిప్రతిష్ట, ధ్వజారోహణం, ఆమలక లక్ష్మీ నారాయణ స్వామి కల్యాణం, గరుడోత్సవం, 26న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం, 27న సీతారామ కల్యాణం, 28న శ్రీరామ పట్టాభిషేకం, సాయంత్రం 6గంటలకు రథోత్సవం, మార్చి 1న బ్రహ్మోత్సవ పూర్ణాహుతి, చక్రస్నానం, శ్రీపుష్పయాగం, సప్తావరణం, ఏకాంత సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

పేదలకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ

కనిగిరి రూరల్: పట్టణంలోని పదో వార్డులోని పేద కుటుంబానికి మదర్ థెరిస్సా సేవాసమితి ఆధ్వర్యంలో దాత, ఎల్ఐసీ ఏజెంట్ నారాయణ బియ్యం, కూరగాయలు అందచేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌డీ రసూల్, పి.అరుణోదర్, పచ్చవ శేఖర్, ద్రోణాదుల చెంచులు, ఈర్ల రామరాజు పాల్గొన్నారు. మండంలోని ఏరువారిపల్లిలో పాఠశాల ఉపాధ్యాయురాలు గోపవరపు రాగిణి పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు అందచేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న జి.రమేష్ కుటుంబానికి బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. సర్పంచ్ దమ్ము వెంకటయ్య, ఎంపీటీసీ ఎం రమణారెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, గోపవరపు సుబ్బారెడ్డి, పాఠశాల చైర్మన్ బి.వెంకటరెడ్డి, హెచ్ఎం నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పేదల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం



కాటిపాపల కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న అశోక్‌బాబు

- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

సింగరాయకొండ: పేద ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కాఫీ విత్ గృహసారధి కార్యక్రమం ఒక మంచి వేదికలా ఉపయోగపడుతోందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. సింగరాయకొండలోని గ్రామ సచివాలయం–3 పరిధిలోని కాటిపాపల కాలనీలో సోమవారం గృహసారథి దుర్గయ్య ఇంటి వద్ద కాఫీ విత్ గృహసారథి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలోని రామాలయం వద్ద కాలనీ వాసుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాల దూరంగా ఉందని చెప్పడంతో డీఈఓ పి.రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో చిన్నారుల కోసం ట్యూషన్ టీచర్‌ను నియమించేందుకు ఖర్చు తానే భరిస్తానని, విద్యుత్, డ్రెయినేజీ సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాములమ్మ కాలనీలో ఓ వృద్ధుడికి శుక్లాల ఆపరేషన్ ఉచితంగా చేయిస్తానని చెప్పారు. పకీరుపాలెం లేఔట్‌లో భైరాగిమాన్యానికి చెందిన అనాథ బాలిక షేక్ బీబీ కోసం నిర్మిస్తున్న ఇంటిని పరిశీలించారు. తమ సమస్యలపై వెంటనే స్పందించిన వరికూటిని కాలనీ వాసులు అభినందించారు. నరసింహస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, రాజు వెంకటేశ్వరరెడ్డి, షేక్ పటేల్, షేక్ సలీంబాషా, వైస్ ఎంపీపీ రవికుమార్ రెడ్డి, వార్డు మెంబర్ పొదర్తి కోటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందేలా చూడండి



అన్నెబోయినపల్లెలో మాట్లాడుతున్న క్రిష్టారెడ్డి

లింగసముద్రం: అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని మండల జేసీఎస్ పరిశీలకుడు వరికూటి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని అన్నెబోయినపల్లె, చినపవని గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలు అందరి వారి వివరాలు సేకరించి అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పి.తిరుపతిరెడ్డి, ఎంపీటీసీలు దగ్గు వెంకటేశ్వర్లు, చిలకా చంటి, సర్పంచ్ దామా సీతారామయ్య, నాయకులు చీమల శ్రీను, బత్తిన మధు తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న బైకు



ప్రమాదానికి గురైన శ్రావణ్ కుమార్

ఉలవపాడు: ఆగి ఉన్న కారును ఢీకొనడంతో ద్విచక్రవాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. జాతీయరహదారిపై ఉలవపాడు దక్షిణ బైపాస్ సమీపంలో సోమవారం ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే..గుడ్లూరు మండలం పొట్లూరుకు చెందిన పొట్లూరి శ్రావణ్‌కుమార్ ఒంగోలు నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. ఈ సమయంలో ఉలవపాడులో జాతీయరహదారి వెంబడి ఉన్న మామిడి కాయల దుకాణం వద్ద కారు నిలిపి ఉంచారు. వెనుక నుంచి ద్విచక్రవాహనం ఈ కారును ఢీకొట్టింది. నడుపుతున్న శ్రావణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108లో కావలి ఏరియా వైద్యశాలకు తరలిచారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ బాలికల హాస్టల్లో మెరుగైన వసతులు





హాస్టల్ విద్యార్థినులు, వార్డెన్‌తో మాట్లాడుతున్న వరికూటి

- వరికూటి అశోక్‌బాబు

సింగరాయకొండ: స్థానిక ఎస్సీ బాలికల కాలేజీ వసతి గృహంలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మెరుగైన వసతులు కల్పించి, రుచికరమైన భోజనం అందిస్తామని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు భరోసా ఇచ్చారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయతీలోని హాస్టల్‌ను సోమవారం రాత్రి తనిఖీ చేశారు. వార్డెన్ మధ్యాహ్నం వండిన కూరను రుచి చూశారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. భద్రత కోసం వసతి గృహం వెనుక భాగంలో గ్రీన్ నెట్ ఏర్పాటు చేయిస్తానని, దీని వల్ల కోతుల బెడద కూడా తప్పుతుందన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకు ఏర్పాటు చేసి మరుగుదొడ్లకు నీరు వచ్చేలా ఏర్పాటు చేస్తానన్నారు. వంట మనిషిని నియమించే వరకు రోజూ టిఫిన్, భోజనం అందజేస్తానని హామీ ఇచ్చారు. హాస్టల్‌ను త్వరలో అద్దె భవనంలోకి మారుస్తానన్నారు. చదువుపై దృష్టి సారించాలని విద్యార్థినులకు సూచించారు. ఎంపీటీసీ అంబటి ప్రసాద్, కొండపి ఏఎంసీ వైస్ చైర్మన్ మాలె రంగారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, చింతపల్లి హరిబాబు, షేక్ పటేల్, షేక్ సలీంబాషా తదితరులు ఉన్నారు.